## క్లుప్తంగా

### శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్

**ఒంగోలు సబర్బన్:** స్థానిక 18వ డివిజన్ వెంగముక్కలపాలెంలో సోమవారం వార్డుకో వారం కార్యక్రమం నిర్వహించారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించి రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా డస్ట్‌బిన్లలోనే వేయాలని ప్రజలకు సూచించారు. నగర మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం మండల కార్యదర్శిగా పెద్దబ్బాయి

**సంతనూతలపాడు:** సీపీఎం సంతనూతలపాడు మండల నూతన కార్యదర్శిగా కిలారి పెద్దబ్బాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మంగమూరులోని కామ్రేడ్ సీతారామ్ ఏచూరి ప్రాంగణంలో నిర్వహించిన సీపీఎం 7 వ మండల మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఆయనతో పాటు మండల కార్యదర్శివర్గ సభ్యులుగా బంకా సుబ్బారావు, నెరుసుల వెంకటేశ్వర్లు అబ్బూరి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్ లను మహాసభ ఎన్నుకుంది. వారితో పాటు మరో 10 మంది మండల కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. మహాసభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు షేక్ మాబు, కంకణాల ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

### గ్రీవెన్స్‌కు 5 అర్జీలు

**మద్దిపాడు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమానికి రెండు అర్జీలు భూమి సర్వే కోసం రాగా, మరో మూడు అర్జీలు కలెక్టర్ గ్రీవెన్స్ నుంచి మద్దిపాడు చేరాయి. అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

### జీపీడీపీపై శిక్షణ

**మద్దిపాడు:** మండలంలో 22 పంచాయతీ గ్రామ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(జీపీడీపీ) పై ఈ నెల 15, 16 తేదీల్లో శిక్షణ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ వి.జ్యోతి తెలిపారు. 15 వ తేదీన ఏడుగుండ్లపాడు, లింగంగుంట, ఇనమనమెళ్లూరు, దొడ్డవరం, మల్లవరం, కొలచనకోట, దొడ్డవరప్పాడు, పెదకొత్తపల్లి, మద్దిపాడు, నందిపాడు గ్రామాల వారికి శిక్షణ ఇస్తారన్నారు. 16వ తేదీ సీతారామాపురం, బసవన్నపాలెం, గార్లపాడు, గడియపూడి, నేలటూరు, అన్నంగి, గుండ్లపల్లి, రాచవరపాలెం, కీర్తిపాడు, బూరెపల్లి, నాగన్నపాలెం గ్రామాల వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం గం.9.30 నుంచి సాయంత్రం గం.6 వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

**14న సంతనూతలపాడులో..**

**సంతనూతలపాడు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (జీపీడీపీ)పై ఈ నెల 14వ తేదీ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిక్షణకు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

### రెండుమూడు రకాల పంటలు సాగుచేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌బాబు

**ఒంగోలు సిటీ:** రైతులు ఒకే పంట కాకుండా రెండుమూడు రకాల పంటలు సాగుచేసుకోవాలని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రమేష్‌బాబు సూచించారు. సోమవారం మండలంలోని వలేటివారిపాలెం, చేజర్ల గ్రామాల్లో పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పొగాకు సాగు తగ్గించుకోవాలని, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కిషోర్ బాబు, చేజర్ల సర్పంచ్ సీహెచ్ రవికుమార్‌రెడ్డి, ఏఈఓలు ఆదిమూర్తి, రామకృష్ణారెడ్డి, వీఏఏలు అక్క, క్రిష్ణవేణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### యూనివర్శిటీ నిర్మించి తరగతులు ప్రారంభించాలి

**సంతనూతలపాడు:** పేర్నమిట్టలో యూనివర్శిటీ నిర్మించి అక్కడే తరగతులు ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని మంగమూరులో సీతారాం ఏచూరి ప్రాంగణంలో సీపీఎం మండల 7వ మహాసభను సోమవారం నిర్వహించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. మంగమూరు – ఒంగోలు మధ్య నల్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలని, చంద్రపాలెం – మంగమూరు మధ్య కాలువ కట్టపై తారురోడ్డు వేయాలని, జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, సంతనూతలపాడులో మంచి నీరు రోజు మార్చి రోజు ఇవ్వాలని, పేర్నమిట్టలోని 200 ఎకరాల చెరువును మంచి నీటి అవసరాలకు ఉపయోగించాలని, తదితర తీర్మానాలను ఆమోదించారు.




చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరాల బాధితులు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

# ఇంటింటికీ జ్వరాలు..!

- మంచంపట్టిన చీమకుర్తి మండల ప్రజలు
- కమ్యూనిటీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు పరుగులు
- ప్రతిరోజూ 60 నుంచి 80 ఓపీలు
- 50 నుంచి 60 మంది జ్వర పీడితులు
- ప్రైవేటు వైద్యశాలల్లోనూ భారీగా బాధితులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక కనిపించని ఉచిత వైద్య శిబిరాలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడపగడపకూ ప్రభుత్వ పథకాలు అందజేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ జ్వరాలు, మద్యం బాటిళ్లు వస్తున్నాయి. ప్రజా సంక్షేమంతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కూటమి ప్రభుత్వం గాలికొదిలేయడంతో జ్వరాలు, సీజనల్ వ్యాధులతో జనం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మద్యం విక్రయాలపై చూపించిన శ్రద్ధ ప్రజల బాగోగులపై చూపకపోవడంతో ప్రతి ఇంట్లో జ్వరాలు, వ్యాధులతో జనం మంచంపడుతున్నారు. బాధితులతో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో పట్టించుకునే వారు లేక ప్రజలు అల్లాడుతున్నారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్యులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

**చీమకుర్తి రూరల్:** మండలంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు, జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్యం అధ్వానంగా తయారై దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నా ప్రజారోగ్యాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో గ్రామాల్లో జ్వరాలు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, విరేచనాలు, దగ్గు, జలుబు, తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అర్బన్ హెల్త్ సెంటర్లు బాధితులతో నిండిపోయాయి. ఆయా వైద్యశాలలకు ప్రతి రోజూ 60 నుంచి 80 వరకూ ఓపీలు వస్తుండగా, వాటిలో 50 నుంచి 60 మంది వరకూ జ్వరపీడితులే ఉంటున్నారు. అయినప్పటికీ జ్వరాల గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు అందకపోతుండటంతో అధిక సంఖ్యలో బాధితులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి నిలువుదోపిడీకి గురికావాల్సి వస్తోంది. గత నెలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి క్లోరినేషన్, ఫాగింగ్ వంటివి చేయకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నిధులు లేవంటూ చేతులెత్తేశారు. ఫలితంగా ప్రతి గ్రామంలో వ్యాధులు ప్రబలాయి. ఒక ఇంట్లో ఒకరికి వస్తే.. ఆ తర్వాత ఆ ఇంట్లో ఉన్నవారందరికీ అవే లక్షణాలతో జ్వరాలు వస్తున్నాయి. ఇంటిల్లిపాదీ జ్వరంతో మంచం పడుతున్నారు. కొందరికి రెండుమూడు రోజులకు జ్వరం తగ్గుతున్నా జలుబు, దగ్గు మాత్రం వదలడం లేదు. గొంతు బొంగురుబోయేంతగా దగ్గు భయపెడుతోంది. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా జిల్లా యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఊసే లేని ఉచిత వైద్య శిబిరాలు...**

చీమకుర్తి మండలంలో ఏ గ్రామాన్ని పరిశీలించినా ఇంటికొకరు జ్వరంతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కొందరికి డెంగీ లక్షణాలు సైతం ఉంటున్నాయి. విషజ్వరాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే.. ప్రభుత్వం మాత్రం మద్యం వ్యాపారంలో తలమునకలైందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలో జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంగానీ, ఫీవర్ సర్వే చేపట్టడంగానీ, మెరుగైన వైద్యం అందించడం గానీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు...**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పెద్ద ఎత్తున ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రతి ఆరు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించేవారు. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ఉచిత వైద్య శిబిరాల్లో నిపుణులైన వైద్యులతో 14 రకాల వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. అత్యవసర, మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్య పరీక్షలు, వైద్యం కోసం సిఫార్సు చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగాన్ని గాలికొదిలేయడంతో ప్రభుత్వ వైద్యం అందక, ఖరీదైన కార్పొరేట్ వైద్యం చేయించుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే నాణ్యమైన వైద్యం దూరంగా, భారంగా మారిన నేపథ్యంలో ప్రస్తుతం జ్వరాలు, సీజనల్ వ్యాధులు పెరిగి నరకం చూస్తున్నారు.



ఓపీ విభాగం వద్ద బాధితులు

**వారం నుంచి జ్వరంతో బాధపడుతున్నా**



నేను వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా. ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకునే స్తోమత లేక, ప్రభుత్వ వైద్యశాలల్లో సక్రమంగా చూడక.. ఆర్‌ఎంపీల దగ్గర చూపించుకుంటున్నాను. ప్రభుత్వం ప్రజల అవస్థలు పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్యరంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. సచివాలయాలు, విలేజ్ క్లినిక్ల పరిధిలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి స్పెషలిస్టులతో వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. కానీ, ప్రస్తుతం గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు కరువయ్యారు.

– మక్కెన రాజు, పులికొండ

**ఉచిత వైద్య శిబిరాల దాఖలాలే లేవు**



ఏ గ్రామాన్ని పరిశీలించినా ఇంటికొకరు, ఇద్దరు చొప్పున జ్వరంతో బాధపడటం కనిపిస్తోంది. డెంగీ కేసులు కూడా ఉంటున్నాయి. పులికొండలో మక్కెన చిన అబ్రహం (బుజ్జి)కి డెంగీ జ్వరం రావడంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చాలా మంది జ్వరంతో బాధపడుతున్నారు. ప్రజలు విషజ్వరాలతో నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మాత్రం మద్యం వ్యాపారంలో తలమునకలైంది. ప్రజల ఆరోగ్యం గురించి ఏమాత్రం పట్టించుకుంటున్న దాఖలాలు, ఉచిత వైద్య శిబిరాలు లేవు.

– మక్కెన రాజేంద్ర కుమార్, సర్పంచ్, పులికొండ

**పది రోజుల నుంచి రోజుకు 50 మంది వరకూ జ్వరాలు**

చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ప్రతిరోజూ 60 నుంచి 70 వరకు ఓపీలు వస్తున్నాయి. వారిలో 50 మంది వరకూ జ్వర పీడితులే ఉంటున్నారు. ఒళ్లు నొప్పులు, తలనొప్పి, విరేచనాలు, దగ్గు, జలుబు, ఇతర సీజనల్ వ్యాధుల బాధితులే అధికంగా ఉంటున్నారు.

– డాక్టర్ హనీఫ్, చీమకుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్

**రోజుకు 80 ఓపీలు**

చీమకుర్తి అర్బన్ వైద్యశాలకు ప్రతిరోజూ 80 ఓపీల వరకూ వస్తున్నాయి. వారిలో సుమారు 60 మంది వరకూ జ్వర పీడితులే ఉంటున్నారు. గ్రానైట్ గనులు, పాలిషింగ్ ఫ్యాక్టరీల్లో పని చేసే రాజస్థాన్, ఒడిశా, తమిళనాడు, మధ్యప్రదేశ్ ప్రాంత కార్మికులంతా వ్యాధుల బారిన పడి ఆస్పత్రికి వస్తున్నారు. ముఖ్యంగా జ్వరాలు, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, విరేచనాలు, దగ్గు, జలుబు, ఇతర సీజనల్ వ్యాధుల బాధితులే ఉంటున్నారు.

– డాక్టర్ సాల్మన్, చీమకుర్తి అర్బన్ హాస్పిటల్

## స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలతో ఎంతో ఉపయోగం



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం శ్రీదేవి, విద్యార్థులు

**కొత్తపట్నం:** స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అందిస్తున్న సేవలు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మన్నం శ్రీదేవి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పడి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించి ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని, ఆయన బాటలో అందరూ నడవాలని హెచ్‌ఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కొత్తపట్నం నేతాజీ స్కౌట్ ట్రూపు, అంబేడ్కర్ ట్రూపు విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు భారత ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పంపిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కె.హరిబాబు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషన్ ప్రతినిధి కొణిజేటి వెంకట శేషారావు, జిల్లా కోశాధికారి పర్రె వెంకట్రావు, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎస్‌కే జిలానీబాషా, ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లిం మదర్సాలలో పండ్లు పంపిణీ

**ఒంగోలు వన్‌టౌన్:** ముస్లిం మదర్సాలు, వృద్ధాశ్రమాలలో విద్యార్థులు, వృద్ధులకు సోమవారం పండ్లు పంపిణీ చేశారు. దేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఎకనమికల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఒంగోలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు ఖాదర్‌వలి, ఎస్‌కే ఫారుక్, అక్బర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

### బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

**ఒంగోలు సిటీ:** కుటుంబ సభ్యులకు బీమా అండగా ఉంటుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిమ్స్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రోహిత్ అన్నారు. ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబ సభ్యులకు యూనియన్ బ్యాంక్ 106వ ఫౌండేషన్ సందర్భంగా సోమవారం చెక్కు అందజేశారు. ఐఎఫ్ఎల్ ఐసీలో బీమా తీసుకున్న తుమ్మా కనకదుర్గ మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల చెక్కు అందించారు. బ్యాంకు సిబ్బంది హుసేనయ్య, కమల, దుర్గారావు, మురళి, అపర్ణ పాల్గొన్నారు.

## జేసీఐ ఒంగోలు జేఏసీ చైర్మన్ ఎంపిక



శ్రీరాములురెడ్డి

**ఒంగోలు సిటీ:** జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఒంగోలు జేఏసీ చైర్మన్‌గా 2025 సంవత్సరానికి శ్రీరామ్ హైస్కూల్ కరస్పాండెంట్ జేసీ వెన్నపూస శ్రీరాములురెడ్డి ఎంపికయ్యారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రా హైస్కూల్లో నిర్వహించిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాములురెడ్డి మాట్లాడుతూ ఒంగోలు నగరంలో అందరికీ ఉపయోగపడే పనులు చేస్తానన్నారు. ఆయనకు జేసీఐ ఒంగోలు పూర్వ అధ్యక్షుడు, మెంబర్లు శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ జాతీయ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, జేసీఐ జోన్ చైర్మన్ గోపికిషోర్, రీజినల్ చైర్మన్ ఆత్మకూరు బ్రహ్మయ్య, ట్రెజరర్ నంద కుమార్, జేసీఐ ఒంగోలు 2025 అధ్యక్షుడు జేసీఎం వీ సుబ్బారావు, గంధవల్ల బాలకృష్ణ, వరణ్‌కుమార్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

**చీమకుర్తి:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాలపర్తి విజేష్‌రాజ్ విమర్శించారు. సోమవారం చీమకుర్తిలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కనీసం సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలు చేసేలా కనిపించడం లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కొంతమందికే ఇస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తుమ్మల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు భోజనం అందిస్తున్న శిద్దా సుధాకర్

**చీమకుర్తి:** దాతల సహకారంతో చీమకుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఇంటర్ విద్యార్థులకు రానున్న రెండు నెలల పాటు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిద్దా జయలక్ష్మి, భారతి, శిద్దా సుధాకర్ ఆర్థిక సహకారంతో భోజనాన్ని అందిస్తున్నారు. గతంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు ఏడాది పొడవునా దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం అందించారు. ప్రస్తుతం శిద్దా సుధాకర్ కుటుంబానికి చెందిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షిప్తంగా

### కాలువలను పునరుద్ధరించాలి

**సంతనూతలపాడు:** స్థానిక కమ్మబజార్, సాయిబాబా సత్సంగం కేంద్రం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి పూడ్చివేసిన సైడు కాలవలను పునరుద్ధరించాలని స్థానికులు సోమవారం సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మను కూడా కలిసి కాలువల సమస్య పరిష్కరించాలని కోరారు. పొన్నం ఇంద్రబాబు, భాస్కరరావు, ఝాన్సీ, రమాదేవి, చెరుకూరి బాబూరావు, శ్రీనివాసరావు, పద్మ, కామినేని సౌజన్య, అనూష తదితరులు పాల్గొన్నారు.

### శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీవరాహ మహాయజ్ఞం

**ఒంగోలు మెట్రో:** స్థానిక గాంధీరోడ్డులోని అనంత కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీలక్ష్మీవరాహ మహాయజ్ఞ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న మహాయజ్ఞంలో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కలశాభిషేకం కనుల పండువగా సాగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభిషేక పీఠంపై సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి 108 కళశాలతో నేత్రపర్వంగా అభిషేకం జరిపించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 17న మేదర సంఘ కార్తీక వనభోజనాలు

**ఒంగోలు మెట్రో:** మేదర సంఘ కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు స్థానిక ఐశ్వర్యనగర్లోని సదా రామ నామ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహేంద్ర మేదర సంఘ అధ్యక్షుడు టంగుటూరి యల్లలబాబు తెలిపారు. సోమవారం స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా కృష్ణా ఫ్యాషన్స్ దగ్గర కరపత్రాలు ఆవిష్కరించారు. అందరూ పాల్గొనాలని కోరారు. రాష్ట్ర మేదర సంఘ కార్పొరేషన్ తాజా మాజీ చైర్మన్ కేత లలిత నాంచారమ్మ, ఒంగోలు మేదర సంఘ అధ్యక్షుడు కేత నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# శివాలయాల్లో విశేష పూజలు



కాశీవిశ్వేశ్వరుడి ఆలయంలో ధ్వజస్తంభం దగ్గర కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల శివాలయంలో...

**ఒంగోలు మెట్రో:** కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయాల్లో ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్లకు ప్రాతఃకాలమున మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వదళార్చన పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో వేద పురోహితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉదయం శివపార్వతులకు ఉజ్జలసేవ, సాయంత్రం శివపార్వతుల కళ్యాణాలను వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరునికి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు.